చెట్లకు ఊపిరులూదుతూ..

- మహావృక్షాల రక్షణకు శ్రీకారం
- రోటరీ క్లబ్ ఐకాన్స్ ఆధ్వర్యాన వినూత్న కార్యక్రమం


కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పాతిన మహావృక్షం వద్ద కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అవసరమైనంత ప్రాణవాయువును అందిస్తూ మనిషి ప్రాణాలకు ఊపిరులూదేవి పచ్చని చెట్లు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో అటువంటి చెట్లకూ ప్రాణగండం పొంచి ఉంటోంది. ఆపదలో చిక్కుకుంటున్న అలాంటి మహావృక్షాలకు ఊపిరులూదుతోంది రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్. 'మహావృక్షో రక్షతి రక్షితః' అంటూ.. పచ్చని చెట్ల పరిరక్షణకు పూనుకుంటోంది.

రోటరీ క్లబ్ సారథ్యంలో..

సాధారణంగా మహా వృక్షాలను కాపాడటం అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే జరుగుతున్నట్టు అందరం చూస్తూంటాం.. చదువుతూంటాం. ఇటువంటి వినూత్న ప్రక్రియను అందిపుచ్చుకుంటూ మహా వృక్షాలను కాపాడే బాధ్యతను రోటరీ క్లబ్ తన భుజాన వేసుకుంది. మొక్కలు నాటి, వాటిని శ్రద్ధతో పెంచే ప్రయత్నం ఎంత ముఖ్యమో.. దశాబ్దాల వయసున్న మహా వృక్షాలను రక్షించి మరో ప్రాంతంలో ప్రాణ ప్రతిష్ఠ చేస్తే మానవాళి రక్షణకు టన్నుల కొద్దీ ప్రాణవాయువు అందించే అవకాశం ఏర్పడుతుందనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి పూనుకున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా తెలిపారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం నుంచి ప్రజలకు రక్షణ కల్పించే లక్ష్యంతో సామాజిక సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రకటించారు. రోడ్ల విస్తరణలో భాగంగా సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసున్న మహావృక్షాలను నరికి వేయకుండా కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించామని రోటరీ క్లబ్ ప్రకటించింది.

60 రోజుల ముందుగా పనులకు శ్రీకారం

రోడ్ల విస్తరణలో తొలగించాల్సిన మహా వృక్షాన్ని కాపాడాలంటే 60 రోజులు ముందుగానే ప్రాణ ప్రతిష్ఠ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గుర్తించిన చెట్టు వేర్లను నాలుగు దశల్లో పాతవి తొలగించి కెమికల్ ట్రీట్‌మెంట్ నిర్వహిస్తారు. పాత వేర్ల స్థానంలో కొత్త వేర్లు సృష్టించే కార్యక్రమం పూర్తి చేస్తారు. ఈ విధానం దాదాపు 60 రోజుల పాటు నిర్వహిస్తారు. అనంతరం ఆ వృక్షాన్ని భారీ క్రేనులు, జేసీబీ, భారీ ట్రాలీ సహాయంతో మరో ప్రాంతంలో నాటేందుకు తరలిస్తారు. ఇలా నాటిన వృక్షాన్ని మరో 60 రోజుల పాటు సంప్రదాయ ఎరువులతో పోషిస్తారు. జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు వ్యవసాయ భూములలో సుమారు 200 వృక్షాలను ఒక చోట నుంచి మరొక చోటుకు తరలించి సఫలీకృతమైన విషయాన్ని గుర్తించి మహా వృక్షాలను కపాడుకునే ఆలోచన చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు.

వృక్షాన్ని తరలించాలంటే భారీ ఖర్చు



సాధారణ వృక్షాన్ని తరలించడానికి రూ.లక్ష, ఆ తర్వాత సైజును బట్టి ఖర్చు పెరుగుతుంది. రోటరీ క్లబ్ గుర్తించిన మహా వృక్షాన్ని డోనర్ సహాయంతో తరలించే చర్యలు చేపడతాం. వృక్షం నాటిన తర్వాత అక్కడ సంస్థ, డోనర్ పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేస్తాం. ఇప్పటి వరకూ పది మహా వృక్షాలను సురక్షిత ప్రాంతాలను తరలించే లక్ష్యంతో పది మంది డోనర్లను సిద్ధం చేశాం. మొక్కలు నాటి ఏళ్ల తరబడి పెంచే కన్నా, ఏళ్లు తరబడి పెరిగిన మహా వృక్షాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

– తీగల రాజా, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు

చెట్లను కాపాడటం అందరి బాధ్యత



చిన్న మొక్కలు నాటి వాటిని పెంచే ప్రయత్నం కన్నా, ఏళ్ల తరబడి పెరిగిన మహా వృక్షాలను కాపాడుకునే ప్రయత్నం చేయాలి. చెట్లపై అమితమైన ప్రేమతో మహా వృక్షాలను కాపాడాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. చెట్లపై ఉన్న మమకారంలో మూడు నెలలు ప్రత్యేక శిక్షణ పొంది వృక్షాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాం. రోటరీ క్లబ్ సహకారంతో మరిన్ని మహావృక్షాలను కాపాడేందుకు నిరంతర కృషి చేస్తాం.

– రేకపల్లి దుర్గాప్రసాద్, ప్రాజెక్ట్ చైర్మన్


రాజానగరం ఏడీబీ రోడ్డులో గుర్తించిన మహా వృక్షం


భారీ వృక్షానికి కెమికల్ ట్రీట్‌మెంట్ నిర్వహిస్తున్న సిబ్బంది


రాజానగరం మండలం సీతారాంపురంలో తరలించేందుకు గుర్తించిన 70 ఏళ్ల రావిచెట్టు

- మొట్ట మొదటగా రాజానగరం ఏడీబీ రోడ్డులోని సాక్షి పత్రిక ప్రధాన కార్యాలయం ఎదురుగా గల రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 60 ఏళ్ల మర్రిచెట్టుకు శాస్త్రీయ పద్ధతిలో 60 రోజుల పాటు కెమికల్ ట్రీట్‌మెంట్ చేశారు. అనంతరం భారీ క్రేన్, ట్రాలీల ద్వారా రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని కలెక్టర్ క్యాంపు ఆఫీస్ పక్కన నిర్మిస్తున్న కలెక్టర్ సమావేశ మందిరం ప్రాంగణంలో నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.
- మరో మహా వృక్షాన్ని కాతేరు రోడ్డులోని తిరుమల స్కూల్ వద్ద రోడ్డు రివైండింగ్‌లో తొలగించేందుకు గుర్తించారు. 40 ఏళ్ల వయసున్న జమ్మి, రవి కలిసి ఒకే కాండంగా తయారైన మహా వృక్షాన్ని మరో ప్రాంతంలో నాటేందుకు కెమికల్ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. 30 రోజుల తరువాత ఈ వృక్షాన్ని వెంకట నగరం గోదావరి తీరంలో భక్తులు దర్శించుకునే విధంగా నాటేందుకు సన్నాహాలు ప్రారంభించారు.
- రాజానగరం మండలం సీతారాంపురం గ్రామంలో సుమారు 70 ఏళ్ల వయసున్న రావి చెట్టును రోడ్డు విస్తరణలో తొలగించాలని నిర్ణయించారు. దాన్ని మరో ప్రాంతానికి తరలించేలా కెమికల్ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. అదే గ్రామంలోని 70 ఏళ్ల మర్రిచెట్టును సైతం అధికారులు తొలగించేందుకు గుర్తించారు.

క్లుప్తంగా

75 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, వికాస సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు 132 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 75 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, వికాస ప్రతినిధులు పవన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై అవగాహన

సీతానగరం: వంగలపూడి గ్రామంలోని వి.మురళీకి చెందిన పామాయిల్ తోటలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ అధ్యక్షతన మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ఎంఎస్ ప్రకాష్ మాట్లాడుతూ పూర్తి సబ్సిడీతో ఆయిల్ పామ్ మొక్కలను కొత్తగా తోటలు వేసే రైతులకు అందిస్తామన్నారు. డ్రిప్ ద్వారా ఎరువులు అందించడం వల్ల ఖర్చు ఆదా అవుతుందన్నారు. అధిక దిగుబడి సాధించడానికి మెళకువలు, సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు.

దొడ్డిగుంటలో..

రంగంపేట: ఆయిల్‌పామ్ రైతులు యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన విస్తరణ అధికారి ఆర్.అరవింద్‌సాయి సూచించారు. మండల పరిధిలోని దొడ్డిగుంట రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం పతంజలి ఫుడ్స్, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రసన్న వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా ఐదో రోజు కల్పవృక్ష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని కల్పవృక్ష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహ్లాద బాబా జయంతి


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ తులసి

పెదపూడి: పైన గ్రామంలో తోటల పండరి సద్గురు ప్రహ్లాద బాబా ఆశ్రమంలో ఆయన 104 జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కేతా తులసి హాజరయ్యారు. కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. భజనలతో కీర్తనలు పాడారు. భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దాట్ల సుబ్బరాజు, సూర్యనారాయణరాజు, మాజీ సర్పంచి కట్టా రమణ, భద్రం, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికైన క్రీడాకారులు

బిక్కవోలు: బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంగళవారం పలువురు అభినందించారు. 2023–24 సంవత్సరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ తాడేపల్లి గూడెం దగ్గర పెంటపాడు డీఆర్‌జీ గవర్నమెంట్ కాలేజీలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సగరం సంతోష్, సీహెచ్ రాజు, బి.ఆనంద్, బి.జ్యోతిబాబు, పి.నాగేంద్ర ప్రథమ స్థానం సాధించారు. వీరిలో సగరం సంతోష్, సీహెచ్ రాజు, బి.ఆనంద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి త్వరలో బెంగళూరులో జరిగే పోటీల పాల్గొంటారని శ్రీ ప్రజ్ఞ కళాశాల కరస్పాండెంట్ ఓదూరి శ్రీను తెలిపారు. క్రీడాకారులను డిగ్రీ ప్రిన్సిపాల్ ఎ.వి కృష్ణారెడ్డి, జూనియర్ ప్రిన్సిపాల్ ఎస్.గోవింద్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం ధనుర్మాసం చివర మంగళవారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పథకాలతో అందరికీ ప్రయోజనం
- దివాన్‌చెరువులో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


దివాన్‌చెరువులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వ పాలన జరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్ చెరువులో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారి యోగ క్షేమాలను తెలుసుకోవడంతో పాటు గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం పరంగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పథకాలను అందించామన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా పరిపాలనను క్షేత్రస్థాయికి తీసురావచ్చామన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ.2.86 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, రూ.40 లక్షలతో పక్కా డ్రైనేజీల నిర్మాణం చేపట్టామన్నారు. తరచూ ముంపునకు గురవుతున్న దివాన్ చెరువు – శ్రీరామపురం రోడ్డును రూ.1.80 కోట్లతో సీసీ డ్రైన్లతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశామన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

పలివెల స్వామి, బొల్లి వీరభద్రరావు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన అంకం గోవింద్, తణుకు నాగేశ్వరావు, బత్తుల వెంకన్న, పలివెల సత్తిబాబు, రాపాక శివ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు మెడలో వేసి, స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, స్థానిక నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం


పేదలకు భోజనం వడ్డిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జక్కంపూడి అక్షయామృత నిత్యాన్నదాన సేవ పథకం ద్వారా పేదల ఆకలి తీర్చుతున్నామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద మంగళవారం పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వారంలో ఒక రోజు నాన్‌వెజ్‌తో కూడిన ఆహారం అందిస్తామన్నారు. మూడు మండలాల్లో దీనిని ప్రారంభించినట్టు తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా అన్ని రంగాల్లో పలు కార్యక్రమాలు చేయాలనే ఆలోచన ఉందన్నారు. సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు మహిళలను సమాయత్తం చేసి పలు రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు.

ప్రజా మద్దతుతో రెండోసారి విజయం


గోకవరంలో పర్యటిస్తున్న తోట నరసింహం

గోకవరం: ప్రజా మద్దతుతో రానున్న ఎన్నికల్లో రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఘన విజయం సాధిస్తారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం సాయంత్రం తొలిసారి గోకవరంలో ఆయన పర్యటించారు. స్థానిక దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అక్షింతల రాజా ఇంటికి వెళ్లి, రానున్న ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ భర్త, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్‌ను, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ కుమారుడు గణేష్‌ను పరామర్శించారు. కృష్ణునిపాలెం పంచాయతీలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు నందూరి గంగాధర్ ఇంటికి వెళ్లి, పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట తోట నరసింహం తనయుడు రాంజీతో పాటు నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, దాసరి చినబాబు, సమ్మెటి మోహన్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ తదితరులున్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

అనపర్తి: స్థానిక శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో గత ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న 25వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆరాధనోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం బెంగళూరుకు చెందిన శివప్రియ నృత్య పాఠశాల గురువు డాక్టర్ సంజయ్ శాంతారామ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది కళాకారులు పలు నృత్య రూపకాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ శాంతారామ్ నట్టువాగం, గాత్ర సహకారం అందించారు. పారిశ్రామికవేత్త తేతల ఉపేంద్రరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న ఆయిల్‌పామ్ తోటలు

బిక్కవోలు: మెట్ట ప్రాంతంలో ఆయిల్‌పామ్ తోటల సాగు వేగంగా విస్తరిస్తోందని పెద్దాపురంలోని పతంజలి పాయాయిల్ కంపెని డీజీఎం రవింద్ర అన్నారు. మంగళవారం ఇలపల్లి గ్రామంలోని రైతు సదస్సు నిర్వహించారు.

పేద కుటుంబాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


సంపరలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదల కుటుంబంలో వెలుగులు, ఆనందం నింపాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలో కరకుదురు, కైకవోలు, పైన, చింతపల్లి, కుమారప్రియం, గండ్రేడు తదితర గ్రామాల్లో రూ.3వేలకు పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు వుండ్రు చంద్రకళ, నూని పట్టాభిరామన్న చౌదరి, సుందరపల్లి ప్రమీళ, కొల్లు లోవకుమారి, బిరద వీరవెంకటసత్యనారాయణ, కుడిపూడి మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలు జరిగియి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల గుండె చప్పుడు జగన్ అన్నారు. జగన్‌ను మళ్లీ సీఎంగా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధకర్, పార్టీ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు
- క్రికెట్ టోర్నీ ప్రారంభం


సంపరలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ముక్తేశ్వరరావు

పెదపూడి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ సిటీ నియోజకవర్గం పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. సంపర గ్రామంలో కె.సోమశేఖర్ అయ్యప్ప(ధోని) క్రికెట్ టోర్నమెంట్‌ను ముక్తేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నుంచి క్రీడకారులు మరింత ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. మండల స్థాయిలో జరిగే టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొంటున్నాయన్నారు మొదటి మ్యాచ్ శహపురం, వేండ్ర గ్రామాల మధ్య జరిగింది. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన

రాజానగరం: కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఈవీఎం, వీవీప్యాట్‌లతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా రాజానగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఒక ఈవీఎం, వీవీప్యాట్ ఉంచామన్నారు. అలాగే నియోజకవర్గమంతటా తిరిగి ఓటర్లకు అవగాహన కలిగించే విధంగా మెబైల్ వ్యాన్ ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ సెక్యూరిటీతో కూడిన ఈ వాహనంలో ఈవీఎం, వీవీప్యాట్ ఉంటాయన్నారు. ఈ మెబైల్ వ్యాన్ ప్రస్తుతం రాజానగరం మండలంలో తిరుగుతోందని, 11 నుంచి కోరుకొండ మండలంలో, ఆ పై సీతానగరం మండలంలో పర్యటిస్తుందన్నారు. అలాగే వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఈ విధానాన్ని అమలు చేశారన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, తిరిగి వచ్చిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థులను వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మంగళవారం అభినందించారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ సెంటర్ పోంగ్ డ్యామ్ వద్ద 10 రోజుల పాటు వీరు క్యాంప్ నిర్వహించారు. స్విమ్మింగ్, క్యాకింగ్, సర్ఫింగ్, బోటింగ్, ట్రెక్కింగ్‌లలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఐ.ఆనందబాబు, ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, జి.ఆది, పి.దుర్గాగణేష్, సీహెచ్.శరిష్మా, పి.సాయిరత్నం, ఆర్.ఉష, కె.హర్షిణి, ఎస్ లక్ష్మీదేవి మున్నగు 10 మంది వలంటీర్లు పాల్గొన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


వెదుళ్లపల్లి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు


సింగంపల్లిలో భోగిమంట వద్ద విద్యార్థుల సందడి

సీతానగరం: వెదుళ్లపల్లి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు ఎల్.సీతారత్నం ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల అలంకరణ, కోడిపందాలు, భోగిమంటలు, విద్యార్థుల నృత్యాల నడుమ ఉత్సాహంగా ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామంలోని మహిళలకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ చీరలు పంపిణీ చేశారు. పాఠశాల వాచ్‌మన్ శ్రీహరికిన దుస్తులు అందించారు. స్థానిక హరిదాసును విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు పీడీ చింతాలబ్బాయి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రంగంపేట: సింగంపల్లి గ్రామంలో గల శ్రీవిద్యా యూపీ స్కూల్లో విద్యార్థులు మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సంబరాల్లో విద్యార్థులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంట వేసి ప్రదక్షిణలు చేసి గీతాలు ఆలపించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండగ, సంస్కృతి, సంప్రదాయాలు, విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు సర్వం సిద్ధం


దోసకాయలపల్లిలో సిద్ధమైన బ్యాడ్మింటన్ కోర్టు

మధురపూడి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకూ ఇవి జరుగుతాయి. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీల నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పీఈటీలు పోటీలు నిర్వహిస్తారు. ఇప్పటికే గ్రామ స్థాయి పోటీలు పూర్తవడంతో మండల స్థాయిలో మొదలవుతున్నాయి. ఈ పోటీల్లో 24 సచివాలయాలకు చెందిన 1,410 మంది క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల్లో తలపడతారు. ఈ మేరకు బూరుగుపూడి, దోసకాయలపల్లి, గుమ్ములూరు, పశ్చిమగానుగూడెం గ్రామాల్లో మైదానాలు సిద్ధమయ్యాయి. బుధవారం ఉదయం 7.30 గంటలకు బూరుగుపూడి కంటే వినయ్‌తేజ గ్రౌండ్‌లో వాలీబాల్, దోసకాయలపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమవుతాయి. పశ్చిమగానుగూడెం సృజన కాలేజీ గ్రౌండ్‌లో ఈనెల 12 నుంచి కబడ్డీ, దోసకాయలపల్లి హైస్కూల్ మైదానంలో 17 నుంచి క్రికెట్, గుమ్ములూరులో 18 నుంచి ఖోఖో పోటీలు జరుగుతాయి.

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమై 20వ తేదీన ముగుస్తాయన్నారు. మొదటి రోజు బ్యాట్మింటన్, వాలీబాల్, 11న వాలీబాల్, కబడ్డీ, 12న కబడ్డీ, ఖోఖో, 18 నుంచి 20 వరకు క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

నన్నయ యూనివర్సిటీలో..

రాజానగరం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు సచివాలయాల స్థాయిలో విజయవంతంగా పూర్తయ్యాయని, బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో 20వ తేదీ వరకు జరుగుతాయని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. సచివాలయాల స్థాయి పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటారన్నారు.